క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు



కలెక్టర్ చేతుల మీదుగా గుర్తింపు పత్రం అందుకుంటున్న తహసీల్దార్ ఓబులేసు

గుత్తి: గుత్తి తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా అనంతపురంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదగా తహసీల్దార్ ఓబులేసు, వీఆర్వో రంగయ్య ఐఎస్‌ఓ గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. గుత్తి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడం, పని వేళల బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రశాంత వాతావరణం కల్పించడంతో పాటు మొత్తం 38 ప్రమాణాలు పాటించిందుకు ఐఎస్‌ఓ గుర్తింపు లభించినట్లు తహసీల్దార్ తెలిపారు.

సజావుగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రాఘవరెడ్డి

పుట్లూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం సజావుగా నిర్వహించారు. ఎంపీపీ రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు తమ శాఖలలో కొనసాగుతున్న కార్యక్రమాల గురించి ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మాట్లాడుతూ మండలంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితి కొనసాగుతోందని, ప్రజాప్రతినిధుల సహకారంతో భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాకుండా సమష్టి కృషితో పని చేయాలన్నారు. ఏఓ కాత్యాయని మాట్లాడుతూ 25 శాతం సబ్సిడీతో పప్పుశనగ పంపిణీ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, ఈఓఆర్డీ జిలాన్ బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీఐటీయూ కాలనీలో 21 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని ఎమ్మెల్యే జయరామ్‌ను సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో సీపీఎం నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కసాపురం రోడ్ సర్వే నెంబర్ 398, దోనిముక్కల రోడ్డు సర్వేనెం.43లో గుట్టలను చదును చేయించి అందులో పేదలకు స్థలాలిచ్చి ఇళ్లను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు మారుతి, రమేష్, చంద్రశేఖర్, కెఎం.బాష, అబ్దుల్లా, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, క్లీనర్లు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

గుంతకల్లు రూరల్: డ్రైవర్లు, క్లీనర్లు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఐఓసీ చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్ సూచించారు. మండలంలోని నక్కనదొడ్డి సమీపంలో ఉన్న ఐఓసీ డిపోలో మంగళవారం ప్రగతి మైత్రీ మహిళా సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్లు, క్లీనర్లకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యుడు కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లు వారాల తరబడి సరైన తిండి, నిద్ర లేక ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఇలాంటి సమయాల్లో జాగ్రత్తగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఓసీ మేనేజర్ రాజేంద్ర, లైజనింగ్ ఆఫీసర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం యాడికి మాజీ సర్పంచు బాలా రమేష్ బాబు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌బాబు భార్య బాలా రమాదేవి, కూతురు విజయశ్రీ, అల్లుడు రాఘవ, చిన్న కూతురు కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ కోత.. బీమా ఎత్తివేత

- 40 శాతం నుంచి 25 శాతానికి పప్పుశనగ రాయితీ తగ్గింపు
- బీమా ప్రీమియంపై చేతులెత్తేసిన సర్కార్
- కూటమి ప్రభుత్వంపై అన్నదాతల మండిపాటు



పుట్లూరు మండలం శనగలగూడూరులోని రైతు సేవా కేంద్రం వద్ద పప్పుశనగ విత్తనాల కోసం వచ్చిన రైతులు



తాడిపత్రి మండలంలో పప్పుశనగ సాగు కోసం పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

పుట్లూరు/తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం సబ్సిడీలో కోత విధించడంతో పాటు అరకొరగా పప్పుశనగ విత్తనాలను సరఫరా చేసి రైతుల జీవితాలతో అటలాడుకొంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రైతులకు పప్పుశనగ అందించింది. ఈ ఏడాది రాయితీ 40 శాతం నుంచి 25 శాతానికి కూటమి ప్రభుత్వం తగ్గించడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. రబీలో పప్పుశనగ సాగుపై అన్నదాతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పప్పుశనగ సాగు చేయడానికి రైతన్నలు పొలాల్లో సేద్యం పనులు పూర్తి చేయడంతో పాటు ఎరువులు వేసి విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అరకొర సబ్సిడీతో పప్పుశనగలను పంపిణీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.కాగా తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో సాధారణంగా 22 వేల హెక్టార్లల్లో పప్పు శనగను సాగు చేస్తారు. తాడిపత్రి మండలంలో 6,229 హెక్టార్లు, పెద్దపప్పూరు మండలంలో 5,345 హెక్టార్లు, పుట్లూరు మండలంలో 7,489 హెక్టార్లు, యల్లనూరు మండలంలో 3,310 హెక్టార్లల్లో పప్పుశనగను రైతులు సాగు చేయనున్నారు.

సర్దుబాటు చేస్తున్న వ్యవసాయాధికారులు


అరకొరగా వచ్చిన పప్పుశనగను సర్దుబాటు చేసే పనిలో వ్యవసాయాధికారులు ఉన్నారు. దీంతో సన్న, చిన్న కారు రైతులు కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా మండి పడుతున్నారు. సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూసిన తమకు అరకొర విత్తనాలను కట్టబెట్టడంతో వ్యవసాయ సిబ్బందితో వాగ్వావాదానికి దిగుతున్నారు. నిబంధనల మేరకు ఐదు ఎకరాల్లోపున్న రైతులకు ఎకరాకు రెండు క్వింటాళ్ల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంది. 20 కిలోల ప్యాకెట్లను పది ఇవ్వాల్సి ఉండగా ఐదు ప్యాకెట్లు మాత్రమే ఇస్తున్నారు. రెండోవిడత విత్తన పప్పుశనగ వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి

ఈ ఏడాది రబీలో సాగు చేసే పప్పుశనగ పంటతో పాటు ఇతర పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఉచిత పంటల బీమాపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో పాటు ఆ భారాన్ని రైతులే భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. గతంలో బీమా పొందాలంటే ఎన్నో కష్టాలు పడేవారమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి బీమా ప్రీమియం చెల్లించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల ఆశలపై నీళ్లు..

కూటమి ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ గతంలో 40 శాతంగా ఉన్న పప్పుశనగ విత్తనాలపై ఉన్న సబ్సిడీని ఈ ఏడాది 25 శాతానికి తగ్గించింది. దీంతో బహిరంగ మార్కెట్‌తో సమానంగా రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పప్పుశనగ విత్తనాల ధరలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది క్వింటాళ్ పప్పుశనగ ధర రూ.9,400 గానూ 25 శాతం సబ్సిడీ రూ.2350 పోనూ రైతులు క్వింటాళ్‌కు రూ.7,050 చెల్లించాలని నిర్ణయించారు. ఈ ధరతో కొంచె అటు ఇటుగా ప్రైవేట్ మార్కెట్‌లో సైతం పప్పుశనగ విత్తనాలు లభిస్తుండటంతో రైతు సేవా కేంద్రాలల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ తగ్గిపోయింది. కాగా తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌కు అధికారులు 14,195 క్వింటాళ్ల పప్పుశనగకు ప్రతిపాదనలు పంపారు. కానీ 8,100 క్వింటాళ్ల పప్పుశనగ మాత్రమే వచ్చింది. పప్పుశనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీపై అందించి ఉంటే పెట్టుబడి తగ్గి ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.



విత్తన పప్పుశనగ కేటాయింపు ఇలా..

మండలం	క్వింటాళ్లు
పుట్లూరు	3,400
యల్లనూరు	1,400
పెద్దపప్పూరు	1,200
తాడిపత్రి	2,100

రెండోవిడత విత్తనాలు వస్తాయి



ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనల్లో 60 శాతం పప్పుశనగ విత్తనాలు మాత్రమే వచ్చాయి. రెండో విడతగా మిగిలిన విత్తనాలు వస్తాయి. విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ ఉండటంతో సర్దుబాటు చేస్తున్నాం. అదనంగా విత్తనాలను సరఫరా చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాగే పప్పుశనగ రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది.

– చెంగలరాయుడు, ఏడీఏ, తాడిపత్రి

రాయితీ తగ్గించారు



ఏటా 40 శాతం సబ్సిడీపై అందించే పప్పుశనగ విత్తనాలను ఈ ఏడాది కూటమి ప్రభుత్వం 25 శాతానికే తగ్గించింది. దీంతో బహిరంగ మార్కెట్‌కు కొంచెం అటు ఇటుగా రూ.7,050తో ప్రభుత్వం విత్తనాలను అందించడానికి రైతులతో రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ సబ్సిడీ వల్ల రైతులకు పెట్టుబడి భారం ఏమి తగ్గలేదు. 40 శాతం సబ్సిడీని కొనసాగించి ఉంటే రైతులకు విత్తనాలపై పెట్టుబడి కొద్దిగా తగ్గి ఉండేది.

– రాఘవరెడ్డి, రైతు, తిమ్మాపురం, పుట్లూరు మండలం

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



ప్రభుత్వం ఈ ఏడాది రబీ నుంచి రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని చెబుతున్నట్లు తెలిసింది. అలా చేయడం వల్ల చాలా మంది రైతులకు అవగాహన లేక బీమా ప్రీమియం సకాలంలో చెల్లించలేక నష్టపోయే అవకాశం ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంట బీమా చేసిన విధంగా ఈ ప్రభుత్వం కూడా ఈ క్రాప్ బుకింగ్ సమయంలో రైతుల ప్రీమియం చెల్లించి రైతులకు అండగా నిలబడాలి.

–వెంకటశివారెడ్డి, రైతు, వెంగన్నపల్లి, పుట్లూరు మండలం

డిమాండ్ మేరకు పంపిణీ చేయాలి



కష్టాలతో సతమతమవుతున్న కరువు రైతులను ఆదుకునేందుకు డిమాండ్ మేరకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను సరఫరా చేయాలి. ఖరీఫ్‌లో రైతులు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. రబీలోనైనా పప్పుశనగ ద్వారా చేసిన అప్పులు తీర్చుకునేందుకు అధికారులు అండగా ఉండాలి.

– సజ్జలదిన్నె రాజు, రైతు, సజ్జలదిన్నె, తాడిపత్రి మండలం

వృత్తి విద్యాకోర్సులతో స్వయం ఉపాధి



పామిడి మోడల్‌స్కూల్‌లో వృత్తి విద్యా కోర్సుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అనంతపురంలో శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పామిడి/బుక్కరాయసముద్రం: వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల స్వయం ఉపాధికి ఎంతగానో తోడ్పడతాయని పామిడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వై.అరుణ అన్నారు. ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మోడల్‌స్కూల్‌లో మంగళవారం శిక్షకుడు రాఘవేంద్ర వృత్తి విద్యపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సులో భాగంగా బేకరి ఐటమ్స్ తయారీపై వివరించారు. కార్యక్రమంలో పీడీ నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 25 మంది విద్యార్థులకు అనంతపురంలోని ఐటీఐ కళాశాలలో వృత్తి శిక్షణలో భాగంగా సెల్‌ఫోన్, కంప్యూటర్ రిపేరిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, జీసీడీఓ రవూఫ్, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, ఒకేషనల్ కోఆర్డినేటర్ మధు, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కమనీయం.. అమ్మ రూపం

సాక్షి నెట్‌వర్క్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



తాడిపత్రిలో మహాలక్ష్మిగా విజయ చౌడేశ్వరీదేవి



తాడిపత్రిలో సరస్వతీదేవిగా రాజరాజేశ్వరీదేవి



గుంతకల్లులో వైష్ణవీదేవిగా కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారు



గుత్తిలో వారాహిదేవిగా వాసవీమాత



పెద్దవడుగూరులో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



శింగనమలలో కొల్లాపురం మహాలక్ష్మిగా వాసవీమాత



పామిడిలో లలితాదేవిగా కన్యకా పరమేశ్వరి



బీకేఎస్‌లో కాయగూరల అలంకరణలో పెద్దమ్మ తల్లి



శింగనమలలోని దుర్గాంజనేయ కొండపై దుర్గాదేవి

నేటి నుంచి శిక్షణ తరగతులు

యాడికి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో రెండు రోజుల పాటు వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో ఉప సర్పంచు, ఇద్దరు వార్డు సభ్యులకు బుధ, గురు వారాల్లో శిక్షణ తరగతులుటాయన్నారు. ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచు, ఇద్దరు వార్డు సభ్యులు శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

యల్లనూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ఉప సర్పంచు, ఇద్దరు వార్డు మెంబర్లకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు బుధ, గురువారాల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ మనోహర్‌బాబు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి అందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచులు, ఇద్దరు వార్డు మెంబర్లకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధ, గురువారం శిక్షణ ఇస్తాన్నామన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడా మైదానంలోని పేకాట స్థావరంపై సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు మట్కా బీటర్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 43,250 నగదుతో పాటు 24 మట్కా చీటీలు, 5 పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు హనుమంతు, రమేష్ నాయక్, పీసీలు భాస్కర్ నాయుడు, షెక్షావలి పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో మట్కా బీటర్లు నాగరాజు, మస్తాన్ , ప్రవీణ్, రామకృష్ణను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.6 వేలు నగదును స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలించారు. అలాగే మండల వ్యాప్తంగా 10 మంది పాత మట్కా బీటర్లను తహసీల్దార్ సమక్షంలో బైండోవరు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీఐ సత్యప్రసాద్, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన మట్కా బీటర్ అబ్దుల్లాను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గౌసమహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడి చేసి మట్కాబీటర్ అబ్దుల్లాను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి మట్కా చీటీలు, రూ.10,130లు నగదు స్వాధీనం చేసుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపిక



బి.ఉత్తేజ్



బి.హర్షకుమార్

గుంతకల్లు: అండర్–14 జిల్లా క్రికెట్ జట్టుకు గుంతకల్లుకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్‌లు గులాంఖాదర్ బాషా, సోహెబ్, నజీర్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో భాగమైన అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరఫున స్థానిక రైల్వే క్రీడా మైదానంలో విద్యార్థులకు క్రికెట్ శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ క్యాంప్‌లోని స్పిన్ బౌలర్ బి.ఉత్తేజ్, మీడియం ఫాస్ట్ బౌలర్.హర్షకుమార్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 10న గుంటూరులో జరిగే అండర్–14 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను కోచ్‌లతోపాటు తోటి క్రీడాకారులు, తల్లిదండ్రులు అభినందిచారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ విజయకుమార్

గుత్తి: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ విజయకుమార్ అన్నారు. గుత్తి రైల్వే డీజిల్ షెడ్, బాక్సన్ డిపో, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ ఏడీఎస్‌లు నారాయణ, మస్తాన్ వలి, సెక్రెటరీ రామాంజులరెడ్డి, మనోహర్, ఆఫీస్ బేరర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి

యల్లనూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పుట్లూరు సీఐ సత్యబాబు సూచించారు. మంగళవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఫ్యాక్షను ప్రభావిత ప్రాంతాలపై ఎల్లప్పుడు నిఘా ఉంచాలన్నారు. మట్కా, పేకాట, ఇసుక, మద్యం అక్రమ తదితర వాటిపై నిఘా పెట్టి దాడులు చేసి ఎంతటివారినైనా రిమాండుకు పంపించాలన్నారు. మండలంలో శాంతిభద్రతలపై ఎస్‌ఐ రాంప్రసాద్‌ను సీఐ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండలో రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్‌ఐ గౌసమహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఎస్‌ఐ మాట్లాడుతూ కొప్పలకొండ వద్ద పెన్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పెద్దపప్పూరు: మండలంలోని వరదాయపల్లిలో జగన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ గౌస్‌బాషా మంగళవారం తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన మట్కా బీటర్లు శ్రీరాములు, లక్ష్మీనారాయణను అరెస్టు చేశామన్నారు. వారి నంచి మట్కాచీటీలతో పాటు రూ.5,020 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



సూచనలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

యాడికి: ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. మండలంలోని చందన, యాడికి గ్రామాల్లో ఏఓ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఏడీఏ హాజరయ్యారు. ఆయా గ్రామాల్లోని పత్తి పంటను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. పత్తిలో గులాబీ రంగు పురుగు బెడద ఎక్కువగా ఉందని, నివారణకు స్పైనోసాడ్‌ను పిచికారీ చేయాలన్నారు. పత్తి విత్తిన 45 రోజుల తర్వాత పుష్పించే దశలో లింగాకర్షక బుట్టలను ఎకరాకు 8 చొప్పున పొలంలో ఏర్పాటు చేసి, గులాబీ రంగు పురుగు బెడద నుంచి తప్పించుకోవచ్చన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

బుక్కరాయసముద్రం: మండలంలోని బొమ్మలాటపల్లిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. స్థానికుల వివరాలు మేరకు.. గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫారంలను ధ్వంసం చేసి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. రాగి వైరుకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో దొంగలు ఈ దురాగతానికి పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు. ఘటనపై విద్యుత్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.